ఐసీటీసీకి రాష్ట్రస్థాయి అవార్డు

విద్యానగర్, జనవరి 26: కరీంనగర్ జనరల్ దవాఖానలోని ఐసీటీసీ సెంటర్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం వరించింది. కొన్నేళ్లుగా హెచ్ఐవీ రోగులకు కౌన్సెలింగ్ ఇచ్చి మానసిక స్థైర్యాన్ని కల్పించి జీవిత కాలాన్ని పొడిగించడంతోపాటు ఉత్తమ సేవలకుగాను రాష్ట్రస్థాయి అవార్డు వరించగా, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వాహకులకు పురస్కారంతోపాటు ప్రశంస పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ డాక్టర్ ఎం సదానందచారి, ఐసీటీసీ టెక్నిషియన్ వీ శ్యాంసుందర్, హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ దీప్తిలను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ ఎం ఓ డాక్టర్ నవీన అభినందించారు.

కరీంనగర్ సర్కిల్‌కు తొలి ర్యాంకు

ముకరంపుర, జనవరి 26: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలో కరీంనగర్ సర్కిల్ మొదటి స్థానంలో నిలిచింది. గతేడాది మే నెల నుంచి డిసెంబర్ వరకు సెక్షన్ నుంచి మొదలుకుని డివిజన్ స్థాయి వరకు నిర్దేశించిన పారామీటర్లలో చూపిన పనితీరు ఆధారంగా కార్పొరేట్ కార్యాలయం ర్యాంకులు కేటాయించింది. కాగా, గత ఎనిమిది నెలల్లో కరీంనగర్ సర్కిల్ మంచి పనితీరును ప్రదర్శించి డిస్కం స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. సెక్షన్ స్థాయిలో కరీంనగర్ టౌన్-5 రెండో, కరీంనగర్ టౌన్-9 ఐదో ర్యాంకు, రూరల్ విభాగంలో పెద్దపాపయ్య పల్లె ఐదో ర్యాంకు సాధించింది. సబ్ డివిజన్ పరిధిలో కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్‌కు నాలుగవ, హుజూరాబాద్ ఐదో ర్యాంకు సాధించాయి. కరీంనగర్ అర్బన్ సబ్ డివిజన్ లో కరీంనగర్ టౌన్-1 సబ్ డివిజన్‌కు రెండో, కరీంనగర్ టౌన్-2 సబ్ డివిజన్ మూడో ర్యాంకు సాధించింది. కాగా, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు ఏఈలు, ఏడీఈలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

ప్రపంచంలోనే భారతీయ సంస్కృతి గొప్పది

తెలంగాణచౌక్, జనవరి26: ప్రపంచంలోనే భారతీయ సంస్కృతికి గొప్ప గుర్తింపు ఉందని విశాంత్ర ఎక్సైజ్ సీఐ ప్రతాప చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని గిద్దె పెరుమాండ్ల దేవాలయం మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన భారతమాత పూజ కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వంలోనే దేశాన్ని భారత మాత పిలుచుకొనే అదృష్టం ఒక్క భారతీయులకే ఉందన్నారు. సనాతన సం స్కృతిని సంప్రదాయలను పాటిస్తూ భారతీయులు గర్వపడాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన వ్యక్త సామల కిరణ్, భారత మాత పూజ కమిటీ స భ్యులు శంకర్ సంపత్, రవికుమార్, బాబురెడ్డి, సతీష్, సుధాకర్ ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

వీణవంక, జనవరి 26: మండల కేంద్రంలో వివాహిత మారుపాక రమ్య(26) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..వీణవంకకు చెందిన నీల సాయి కిరణ్ కొంతకాలం క్రితం మారుపాక రమ్యను ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. కొద్దిరోజులుగా బాగానే ఉన్నా, ఆ తర్వాత కట్నం తేవాలని రమ్యను భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో రమ్య మనస్తాపానికి లోనై ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. చల్లూరుకు చెందిన రమ్య మేన మామ కొమ్ము శ్యామ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వీణవంక ఎస్ఐ తిరుపతి తెలిపారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

మానకొండూర్ రూరల్, జనవరి 26: పచ్చునూర్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు పచ్చునూర్ గ్రామానికి చెందిన కనకం విద్యాసాగర్-వరలక్ష్మిల కుమారుడు కనకం వశీకర్ (12) అలుగునూర్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. కెల్లేడులోని అమ్మమ్మ ఇంటికి వెళ్లి, ఆదివారం ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా, తండ్రి ఫిర్యాదుతో మానకొండూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్ని రంగాల్లో ముందుంచుతాం

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్

కరీంనగర్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకల్లో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను వివరించారు. ఆమె మాటల్లోనే.. ''జిల్లాలో 16,565 భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. రైతు భరోసా కింద సాగు యోగ్యమైన భూములకు ఏడాదికి రూ.12 వేలు ఈ రోజు నుంచే అందిస్తున్నాం. కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లాలో సుమారు 40 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిని పారదర్శకంగా పరిశీలించి అర్హులకు అందిస్తాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరవగా, ఇందుకు 2.10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హుల ఎంపిక జరుగుతోంది. మహాలక్ష్మి పథకం కింద 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 3 కోట్ల 14 వేల 82 వేల మంది మహిళలు ఉచితంగా బస్సు సౌకర్యం వినియోగించుకుని రూ.125.50 కోట్ల లబ్ధిపొందారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఇప్పటి వరకు 20,474 మంది పేదలకు చికిత్స అందించాం. ఈ పథకం కింద కొత్తగా 163 సేవలను కొత్తగా చేర్చాం. మొత్తంగా 1,837 రకాల చికిత్సలు అందిస్తున్నాం. హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖాన క్వాలిటీ స్టాండర్డ్ అవార్డుకు ఎంపికైంది. 1,43,899 గ్యాస్ కనెక్షన్లకు రూ.500కే సిలిండర్ సరఫరా చేస్తున్నాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల కంటే తక్కువ వాడుకున్న 1,64,074 కుటుంబాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాం. రూ.2 లక్షల రుణమాఫీ కింద నాలుగు విడతల్లో జిల్లాలో ఇప్పటి వరకు 79,541 మందికి మాఫీ చేశాం. 344 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో దాదాపు రూ.14 కోట్లతో మౌలిక వసతులు కల్పించాం. 157 ప్రభుత్వ పాఠశాలలో 30 వేల మంది విద్యార్థులకు ఒక జత షూ, మూడు జతల సాక్స్‌లు ఉచితంగా అందించాం. విద్యార్థులు నైపుణ్యం సాధించేందుకు టెడ్, ఎడ్, ఒలింపియాడ్, యాక్టింగ్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంతో పాటు కెరియర్ కౌన్సిలింగ్‌పై నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 68,488 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం, ప్రతినెలా 396 టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. పెంచిన కాస్మొటిక్ చార్జీలు విద్యార్థులకు అందిస్తున్నాం. వానకాలం సీజన్‌లో జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2,36,805 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. 11,901 మంది రైతుల నుంచి 72,132 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేశాం. ఇందుకు రూ.500 బోనస్ కింద రూ.33.12 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రతి శుక్రవారం సభలు నిర్వహిస్తున్నాం. మహిళా ఆరోగ్యం, పోషకాహార స్థితిని మెరుగుపర్చేందుకు, సామాజిక సమస్యలు పరిష్కరించేందుకు ఈ సభలు దోహదపడుతున్నాయి. స్నేహిత కార్యక్రమం కింద అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. మహిళా ఆరోగ్య కింద సుమారు రూ. 50 వేల విలువైన 59 రకాల పరీక్షలు మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్నాం. ఇందిరా మహిళా శక్తి పథకం కింద 423 వ్యక్తిగత యూనిట్లకు రూ.8.12 కోట్లు జమ చేశాం. 60 గ్రూపులకు రూ.5.73 కోట్లు కేటాయించాం.'' ఈ వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంతో పాటు సీపీ అభిషేక్ మహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్/కరీంనగర్ రూరల్, జనవరి 26: కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువలు డీ- 86 నుంచి 94 వరకు అన్ని కాలువల చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎస్సారెస్పీ ఎస్ఈని కోరారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కెనాల్ ద్వారా మూడో విడుతగా ఈ నెల 26 నుంచి నీటిని విడుదల చేస్తున్నారని, అన్నికాలువలకు చివరి ఆయకట్టు వరకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించకుంటే తానే స్వయంగా రైతులతో వెళ్లి గేట్లు ఎత్తుతానని, అంతదూరం సమస్యను తీసుకురాకుండా సమస్యను పరిష్కరించాలని సూచించారు.

జాతీయ జెండాకు అవమానం

- తడిపొడి చెత్త బుట్టలో ఇసుక నింపి, కర్ర పాతి ఆవిష్కరణ
- విమర్శలు రావడంతో ఎత్తిన గంటలోపే అవతనం

రామడుగు, జనవరి26: జాతీయ జెండాను చెత్తబుట్టలో ఆవిష్కరించి అవమానించిన ఘటన రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగింది. గ్రామ ప్రజలు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశరాజ్‌పల్లి పంచాయతీ కార్యాలయం వద్ద వేడుకలు జరిపారు. అయితే గత ప్రభుత్వం అందించిన తడిపొడి చెత్త బుట్టను ఇసుకతో నింపి, దానిలో జెండాపైపు ఉంచి పంచాయతీ కార్యదర్శి జాతీయ జెండాను ఎగురవేయగా విమర్శలకు తావిచ్చింది. దీంతో ఎత్తిన గంటలోపే జెండాను అవతనం చేసి, జెండా పైపును పంచాయతీ కార్యాలయంలో ఉంచారు. చెత్త బుట్టలో జెండా ఆవిష్కరణ చేయడం సరికాదంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

జెండా ఎగురవేతలో అపశృతి

సైదాపూర్, జనవరి26: సోమారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జెండావిష్కరణలో అపశృతి జరిగింది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట జెండాను పంచాయతీ కార్యదర్శి రాజీవ్ ఎగురవేస్తుండగా జెండా కింద పడింది. ఇది సరికాదని, కనీస జాగ్రత్తలు తీసుకోకపోతే ఎలా..? అంటూ గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు

సునీల్‌రావు వెళ్లడం వల్ల నష్టమేమీ లేదు

- నగరాభివృద్ధిలో ఆయన పాత్ర శూన్యం
- గంగులపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 26 : నగర మేయర్ సునీల్‌రావు పార్టీని వీడి వెళ్లడం వల్ల బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఆవిర్భవించిన పార్టీ బీఆర్ఎస్ అని, అధికారంలో ఉన్నా.. లేకున్నా లక్షలాదిమంది కార్యకర్తలతో బలోపేతంగా ఉందన్నారు. ఆయన ఒక్కరు పార్టీని వీడినంత మాత్రన పార్టీకి ఆవగింజంత నష్టం కూడా లేదన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారినప్పటి నుంచే సునీల్‌రావులో మార్పు వచ్చిందని, అప్పటి నుంచే పార్టీ మారేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని, పార్టీలో పదవులు అనుభవించి, అవసరం తీరాక వీడారని మండిపడ్డారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై సునీల్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం, కేసీఆర్ ఆదేశాల మేరకే సునీల్‌రావును మేయర్ చేశామని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, వినోద్‌కుమార్, గంగుల కమలాకర్‌ను దేవుళ్లు అని పొగిడిన ఆయన నాడు బండి సంజయ్‌ను ఇష్టం ఉన్నట్టుగా తిట్టారని గుర్తు చేశారు. ఒక్క రోజుకే ఇంత మార్పు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధిలో ఆయన పాత్ర శూన్యమని, స్మార్ట్‌సిటీ తెచ్చిన ఘనత బోయినపల్లి వినోద్ కుమార్, గంగుల కమలాకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్‌దేనని చెప్పారు. స్మార్ట్‌సిటీ నిధులు వచ్చిన బంగారు పల్లెం వంటి కరీంనగర్‌లో సునీల్‌రావు పదవులు అనుభవించారని, ఆయన అంటేనే కమిట్‌మెంట్ లేని నాయకుడని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడే పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండిపెండెంట్‌గా ఆయన సతీమణిని నిలబెట్టి వారి అన్నను ఓడించిన ఘనుడు అని మండిపడ్డారు. అధికారం లేకపోతే బతకలేని పరిస్థితి ఆయనదని, అధికారం ఎక్కడుంటే అక్కడికి వెళ్తారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తే పొన్నం ప్రభాకర్ నిరాకరించారని, దీంతో బీజేపీలోకి వెళ్లారని ఆరోపించారు. సునీల్ రావు ఒక నాగుపాము అని, ఆయన వేసే కాట్లకు బీజేపీ నాయకులు రెడీగా ఉండాలని సూచించారు. కరీంనగర్ రాజకీయాల్లో ఒక జోకర్‌ని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు చేసిన ద్రోహానికి ప్రాయశ్చిత్తంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, దూలం సంపత్, పెండ్యాల మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆరె రవి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కిరాణా షాప్‌లో దొంగతనం

నగదుతో పాటు బంగారు, వెండి నగలు, కిరాణా సామాను మాయం

శంకరపట్నం, జనవరి 26: మండల కేంద్రంలోని ఓ కిరాణా షాపులో దొంగలు పడి నగదు, వెండి, బంగారు నగలు, విలువైన వస్తువులు దోచుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌కు ఎదురుగా గుర్రం అనిత తన కుటుంబ సభ్యులతో కలిసి రేకుల షెడ్డులో ఉంటూ కిరాణా షాపు నడుపుకుంటూ జీవిస్తోంది. ఆదివారం రాత్రి హన్మకొండలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండగా ఇంటికి తాళం వేసి వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా షాప్ రేకులకు ఉండే స్క్రూలు విప్పి గుర్తు తెలియని దొంగలు ఇంట్లోని సొత్తు దోచుకెళ్లారు. బంగారు, వెండి నగలతో పాటు కిరాణా సామాను, వంట గ్యాస్ సిలిండర్లు సైతం దోచుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.5 లక్షలకు పైగా ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పోలీసులు వెళ్లి పరిశీలించి, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. దొంగతనాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుని అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్ఐ రవి తెలిపారు.

రాబడి

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్ టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టి ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్తుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాల లో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.



రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారం అని కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**

సూచీలకు బడ్జెటే దిక్సూచి

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్ల వచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

తపాలా పథకాలు భళా

గరిష్ఠంగా 8.2 శాతం వడ్డీరేటు

తపాలా శాఖ రకరకాల పెట్టుబడి పథకాలను అందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), మంత్లీ ఇన్‌కమ్ డిపాజిట్ (ఎంఐడీ), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో సురక్షిత పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నది. అంతేగాక వీటికి వడ్డీరేటు 6.7 శాతం నుంచి 8.2 శాతం వరకు ఉన్నది. ఈ పథకాల ద్వారా ఇతర ప్రయోజనాలూ మదుపరులకు అందుతుండటం విశేషం.

పథకం	వడ్డీ (%)
పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్	4.00
ఏడాది, రెండేండ్ల ఎఫ్‌డీ	6.9, 7,
మూడు, ఐదేండ్ల ఎఫ్‌డీ	7.1, 7.5
పోస్టాఫీస్ ఆర్‌డీ	6.70
ఎస్‌సీఎస్ఎస్	8.20
పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్	7.40
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.70
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.10
కిసాన్ వికాస్ పత్ర	7.50
మహిళా సమ్మాన్	7.50
సుకన్య సమృద్ధి యోజన	8.20